www.prajasakti.com

# ప్రజాశక్తి

శుక్రవారం 18 అక్టోబర్ 2024

5

అన్నమయ్య



## ఎగువ బండపల్లిలో చిరుత కలకలం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ఎగువ బండపల్లి పరిసరాల్లో చిరుత సంచారం కలకలం రేపింది. గురువారం పంట పొలాలలో సంచరించడంతో ఆ గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మేకలు, ఆవులు, గొర్రెలు, బర్రెలు మేతకు తీసుకువెళ్లాలంటే కాపర్లు భయభ్రాంతులకు గురవుతున్నారు. రైతులు తమ పొలం వద్దకు వెళ్లాలన్న భయపడుతున్నారు. చిరుత మొదటిగా లక్కిరెడ్డిపల్లి మండలం మద్దిరేవుల వంక సమీపంలోని మామిడి తోటలో కనిపించిందని రైతులు చెబుతున్నారు. చిరుత తిరిగి బండపల్లి, చిట్లూరు, ఏకిలపల్లి గ్రామాలలో సంచరిస్తోందని కాపర్లు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని చిరుతను బంధించాలని కోరుతున్నారు.



మామిడి తోటల్లో సంచరిస్తున్న చిరుత

# 3,559 ఎకరాల్లో పంట నష్టం

### కడపలో 3,316, అన్నమయ్యలో 243 ఎకరాలు

### అత్యధికంగా నేలకొరిగిన వరి

**జిల్లాలో అల్పపీడన ద్రోణి అపార నష్టాల్ని మిగిల్చింది. కడప, అన్నమయ్య జిల్లాలో 18 మండలాల పరిధిలో 3,559 ఎకరాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యధికంగా వరి, వేరుశనగ, మినుములు, జొన్న పంటలపై ప్రభావం చూపించింది. కడప జిల్లాలోని 12 మండలాల్లోని ఐదు రకాల పంటలు ప్రకృతి కన్నెర్రకు గురయ్యాయి. అల్పపీడన ద్రోణి ధాటికి ఉభయ జిల్లాల్లోని వ్యవసాయ పంటలకు వాటిల్లిన నష్టాన్ని వ్యవసాయశాఖ 33 శాతంపైగా నష్టపోయిన పంటలను ప్రైమరీ ఎన్యూమరేషన్ చేశారు. పూర్తి స్థాయిలో నష్టపోయిన పంటలను పరిగణలోకి తీసుకుని ఎన్యుమరేషన్ చేస్తే పంట నష్టాల్ని అంచనా వేసినట్లు అవుతుందని చెప్పవచ్చు.**



రాజంపేటలో నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉభయ జిల్లాల్లో 3,559 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. నాలుగు రోజుల కిందట బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ధాటికి కడప జిల్లాలో 3,316 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 243 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ ఎన్యూమరేషన్ చేసింది. కడప జిల్లాలోని 36 మండలాల పరిధిలోని కమలాపురం, వల్లూరు, ఒంటిమిట్ట, కలసపాడు, సిద్ధవటం, బి.కోడూరు, చెన్నూరు, పోరుమామిళ్ల, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, చాపాడు, కడప మండలాల పరిధిలోని 52 గ్రామాలకు చెందిన 1540 మంది రైతులకు చెందిన వరి, వేరుశనగ, మినుములు, జొన్న, కంది పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కడప జిల్లాలో అత్యధికంగా 2,978 ఎకరాల్లో వరి, 51.87 ఎకరాల్లో వేరుశనగ, 301 ఎకరాల్లో మినుములు, 37.05 ఎకరాల్లో జొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు పంటల్లో నీరు నిలిచింది. అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, చిట్వేలి, నందలూరు, పెనగలూరు, రాజంపేట, పీలేరు, టి.సుండుపల్లి మండలాల పరిధిలోని 23 గ్రామాలకు చెందిన 138 మందికి చెందిన 243 ఎకరాల్లో వరి, వేరుశనగ, పంటలకు నష్టం వాటిల్లింది.



చాపాడు : నీట మునిగిన వేరుశనగ పంట

#### నేలకొరిగిన ఉద్యానం

ఉద్యాన పంటలకు సంబంధించి 1,568 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఉల్లి పంటలకు అత్యధిక నష్టం వాటిల్లింది. జిల్లాల్లోని ముద్దనూరు, తొండూరు, దువ్వూరు, యర్రగుంట్ల, వీరపునాయునిపల్లి, వేంపల్లి మండలాల పరిధిలోని 27 గ్రామా లకు చెందిన 825 మంది రైతులు 1,568 ఎకరాల్లో ఉద్యాన పంటలకు పంట నష్టం వాటిల్లింది. పూర్తి స్థాయి ఎన్యూమరేషన్ నాటికి సుమారు రెండు వేల ఎకరాలకు నష్టం చేరుకునే అవ కాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఉల్లి పంట వందలాది ఎకరాలు నేల కొరిగింది. బొప్పాయి, నిమ్మ, వంగ, మిరప, టమో టా, కర్బూజ, ఉల్లి పంటలు నష్టపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభు త్వ ఆదేశాల మేరకు ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన పంట నష్టాలను 33 శాతంపైగా నష్టాలను అంచనా వేయడం తెలి సిందే. దెబ్బతిన్న పంటలను పూర్తి స్థాయిలో ఎన్యూమరేషన్ చేస్తే రెట్టింపు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. రైతు ప్రభుత్వమని ప్రచార హోరు సాగిస్తున్న నాయకత్వం ద్రోణి బారిన పడిన రైతులందరికీ పరిహారం అందించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

# ఆర్థిక అక్షరాస్యతపై దృష్టి సారించాలి

### - కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జాతీయ విద్యా విధానం 2020కి అను గుణంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని జిల్లాను 100 శాతం అక్షరాస్యత కలిగిన జిల్లాగా మార్చడమే ధ్యేయమని ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యకులపై ద ృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు.గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కానా్ఫరేన్స్ హాల్లో ఉల్లాస్ కార్యక్రమం పై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఉల్లాస్ (సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన) కార్యక్రమం పై వివిధ అంశాలను జిల్లా కలెక్టర్కు వివరించారు. జాతీయ విద్యా విధానం-2020 కి అనుగుణంగా దేశంలో 100% అక్షరాస్యతను సాధించేందుకు, తీసుకువచ్చిన కేంద్ర ప్రయోజిత కార్యక్రమం అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్వహించబోతున్నాయన్నారు. ఈ పథకం లేదా కార్యక్రమంలో సమాజంలోని వివిధ వ ృత్తులలో ఉన్న 15 సంవత్సరాల పైబడిన వయోజనులను ద ృష్టిలో పెట్టుకొని తీసుకువచ్చిన కార్యక్రమం అన్నారు. ముఖ్యంగా ఎస్ హెచ్ జి లబ్ధిదారులు, ఆయాలు, వంట వండేవారు, వివిధ రకాల సహాయకులు, వివిధ కార్యాలయాల కాపల దారులు, తదితరులను అక్షరాస్యులుగా చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ సందఠరేగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అన్నమయ్య జిల్లాను 100 శాతం అక్షరాస్యత కలిగిన జిల్లాగా మార్చే దిశగా 13,767 మంది నిరక్షరాస్యలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనబోయే వయోజనులందరికీ కేవలం చదవడం, రాయడం మాత్రమే కాకుండా ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ అక్షరాస్యతలపై కూడా ద ృష్టి పెట్టబోతున్నామన్నారు. ఆర్థిక అక్షరాస్యత పెరగడం ద్వారా ఎస్ హెచ్ జి లబ్ధిదారులు తీసుకునే నిర?యాలు మరింత అవగాహనతో కూడిన నిర?యాలుగా మారుతాయి అన్నారు. డిజిటల్ అక్షరాస్యత ద్వారా ఆర్థిక లావాదేవీలను ఇంటర్నెట్ సౌకర్యంతో త్వరగా చేసుకోగలుగుతారని, బ్యాంకులకు వెళ్లే అవసరం లేకుండా చేయవచ్చన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పాఠ్యప్రణాళిక పర్యవేక్షణ సిస్టం లను టీసీఎస్ సంస్థ ఎటువంటి లాభాపెక్ష లేకుండా ఉచితంగా ప్రభుత్వానికి అందించిందన్నారు. ఈ సందఠరేగా టీసీఎస్ సంస్థ చేస్తున్న సహాయానికి జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్, కమిటీలోని వివిధ సభ్యులకు వివిధ సూచనలను చేశారు. పిడి డిఆర్డిఏ ని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలలో విద్యను అభ్యసించబోయే వారిని గుర్తించడానికి గ్రామ సహాయకులను ఎంపిక చేయాలని ఎంపిక చేసిన గ్రామ సహాయకులకు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. పిడి ఐసిడిఎస్ ఉద్దేశించి మాట్లాడుతూ విద్యనభ్యసించే వారికి తరగతులను ఏర్పాటు చేసేందుకు అంగన్వాడీ కేంద్రాలను ప్రతిరోజు రెండు గంటల పాటు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలను వంట మనుషలను విద్యార్థులుగా పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. సమావేశంలో పిడి డి ఆర్ డి ఏ సత్యనారాయణ, డిపిఓ బాలకృషా?రెడ్డి, జి ఎస్ డబ్ల్యు ఎస్ అధికారి లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

## పిహెచ్సిలో డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నందలూరు

అధిక వర్షాలు కురుస్తున్న కారణంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అధిక వర్షపాతం కారణంగా రవాణాకు దూరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అక్టోబర్ నెలలో కాన్పుకు దగ్గరగా ఉన్న గఠవేతులను గుర్తించి వారిని కాన్పుల కొరకు దగ్గరలోని వారికి ఇష్టమైన ఆసుపత్రులలో చేర్పించాలని సూచించారు. అధిక షుగర్ వ్యాధి, బిపి, తీవ్రమైన జబ్బులతో బాధపడుతున్న వాళ్లను గుర్తించి వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలని అన్నారు. వర్షం తగ్గిన తర్వాత లోతట్టు ప్రాంతాలలో నీటి నిల్వలు ఉండి మలేరియా, డెంగీ జ్వరాలు, విరోచనాలు ప్రబలే దానికి కారణం కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆశాలకు, మహిళ ఆరోగ్య కార్యకర్తలకు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని, ల్యాబ్ను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్కు గల్ల పరీక్షల సేకరణ, వాటిని పరీక్షలు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సిహెచ్ఒ వెంకటనారాయణ, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## 'ఆదిత్య'లో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, దృష్టి అగర్వాల్ ఐ హాస్పిటల్ మదనపల్లి ఆధ్వర్యంలో కళాశాలలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అగర్వాల్ హాస్పిటల్ సిబ్బంది ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలతో బాధపడుతున్నారు వారికి కంటి ఆపరేషన్కి సంబంధించి సలహాలు అందించారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటిచూపు ప్రధానమైనదని కంటి ఆరోగ్య సమస్యలు త్వరగా తెలుసుకొని లోపాలను సరి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో కొంతమంది విద్యార్థులకు కంటి ఆపరేషన్ అవసరమని అగర్వాల్ హాస్పిటల్స్ సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, ఎన్ ఎస్ ఎస్ కమిటీ సభ్యులు ఈశ్వర్ రెడ్డి, దర్శన్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 'అన్నమాచార్య' అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న సి.నాగస్వరూపకు జె.ఎస్.యూనివర్సిటీ వారిచే పిహెచ్డి ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ తెలిపారు. గురువారం సి.నాగస్వరూప మాట్లాడుతూ తాను ఆప్టిమైజింగ్ అల్గోరిథమ్స్ టు ఇంటిగ్రేట్ అడ్వాన్స్డ్ మెషిన్ లెర్నింగ్ మెథడ్స్ ఫర్ ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఐఒటి అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం జరిగిందన్నారు. డాక్టర్ విజయ్ భాస్కర్, అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ సిఎస్ఇ, జెఎస్ యూనివర్సిటీ రవి శర్మ, ఆగ్రా యూనివర్సిటీ వారి పర్యవేక్షణలో పిహెచ్డి చేశానన్నారు. ఈ పరిశోధనలో భాగంగా పరిశ్రమల్లో పరికరాలను స్మార్ట్ పద్ధ తుల ద్వారా అను సంధానించి పరిశ్రమలకు ఉపయుక్తమైన సమాచారాన్ని సేకరించి ఆ డేటాను మెరుగు పరచిన మెషిన్ లెర్నింగ్ అల్గోరిథంలను ఉపయో గించి ముందస్తుగా పరికరాల నిర్వహణ, అవసరాలను, ఊహించవచ్చని, సైబర్ దాడులను అరికట్టవచ్చన్నారు. పరికరాల సమర్థతను పెంచడం, మరమ్మత్తుల ఖర్చులను తగ్గించడం, పరిశ్రమల పనితీరు మెరుగుపరచడం ఈ పరిశోధన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఛాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు డీన్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం డాక్టర్ సి.నాగస్వరూపను అభినందించారు.

## ముందస్తు జాగ్రత్తలతోనే ఆరోగ్యం సాధ్యం

ప్రజాశక్తి-పీలేరు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా వ్యాధి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. గురువారం యల్లమంద క్రాస్లో తలుపుల పిహెచ్సి వైద్యాధికారుల ఆదేశాల మేరకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న చిన్న వ్యాధులతో బాధపడుతున్న 23 మందికి వైద్య చికిత్సలు అందిచారు. శిబిరాన్ని ఉద్దేశించి హెచ్ఇ మాట్లాడుతూ ఆరోగ్య విద్యలో భాగంగా వ్యాధులు లేని కుటుంభం ఎలా సాధ్యమో, సురక్షిత మంచి నీరు, తాజా ఆహారం, తరచూ చేతులు శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్ఎం భార్గవి, ప్రమీల, సిహెచ్ఒ చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సిఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాయచోటి ట్రాఫిక్ సిఐ విశ్వనాధ్రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియతో మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఉండేవిధంగా చూడాలని తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే అలాంటి వాహనాన్ని జీజ్ చేస్తామని హెచ్చరించారు. రవాణా శాఖ నియమ నిబంధనలు తప్పకుండ పాటించాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనం నడిపితే వారి తల్లితండ్రులు శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు.

# వాల్మీకి జీవితం ఆదర్శనీయం : జెసి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెసి

ప్రజాశక్తి - రాయచోటి

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని, ధర్మం, సత్యం వంటి విలువలకు నిదర్శనం రామాయణమని జెసి ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్లో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జెసి ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన్ మాట్లాడుతూ నేడు మన సమాజానికి ధర్మం, సత్యం వంటి విలువలను తెలియజేసే రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటు న్నామన్నారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అని తెలియజేయడానికి వాల్మీకి మహర్షి ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. బోయ వర్గానికి చెందిన వాల్మీకి రామాయణాన్ని రచించి మహర్షి అయ్యాడన్నారు. వాల్మీకి జీవితాన్ని మనం స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడిచి మన జీవిత లక్ష్యాలను ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సందప్ప మాట్లాడుతూ హిందూ ఇతిహాస గ్రంథమైన రామాయణాన్ని 24 వేల శ్లోకాలతో, ఏడు కాండాలతో మహర్షి వాల్మీకి రచించాడని తెలిపారు. ఒక మనిషి ఏ విధంగా జీవించాలో రామాయణం మనకు తెలుపుతుందని పేర్కొన్నారు. సంస్కృత సాహిత్యంలో మొట్ట మొదటి శ్లోకం మనకు అందించిన మహనీయుడు మన మహర్షి వాల్మీకి అని కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి సందప్ప, వాల్మీకి సంఘ అధ్యక్షులు భక్తవత్సలం, వాల్మీకి సేవాదళ్ అధ్యక్షులు మూగిరెడ్డప్ప, జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షులు యోగానంద బాబు, కురబలకోట చిన్నరెడ్డి బోయ, ముండ్ల రామాంజి నేయులు పాల్గొన్నారు.

**రాయచోటి టౌన్ :** వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోని జీవితంలో ముందుకు సాగాలని ఎస్పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. మహర్షి జయంతి సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని సంకలనం చేసిన మహనీయులు వాల్మీకి మహర్షి అని ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణ మధుర కావ్యాన్ని యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించారన్నారు. మొదటి సారిగా సంస్కృతంలో శ్లోకాలను రచించినందు కు వాల్మీకి మహర్షికి ఆది కవిగా, రామాయణానికి ఆది కావ్యంగా పేరు వచ్చిందన్నారు. రామాయణ మహాగ్రంథం ద్వారా మానవ కుటుంబ సంబంధాలను సమాజానికి తెలియజ ేశారని పేర్కొన్నారు. మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. రామాయణం స్ఫూర్తితో కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకొని ధర్మబద్ధంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పి బి.చిన్నికృష్ణ, ఎఒ బి.కృష్ణుడు, ఆర్ఐ (అడ్మిన్) వి.జె.రామకృష్ణ, పోలీసు మోటారు వాహనాల అధికారి (ఆర్ఐ) ఎం.పెద్దయ్య, ఎస్బి సిఐలు, టి.వి.సత్యనారాయణ, శంకరయ్య, చలపతి, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, డిపిఒ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పి



విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి విద్యాసాగర్ నాయుడు

## ఆలయాన్ని ధ్వంసం చేసిన నిందితులు అరెస్టు

### - వివరాలు వెల్లడించిన ఎస్పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ములకలచెరువు సమీపంలోని కనుగొండ అటవీ ప్రాంతంలో ఉన్న అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయాన్ని ధ్వంసం చేసిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేవంలో ఆయన మాట్లాడుతూ ఇరువురి పూజారుల మధ్య ఆధిపత్యం కోసమే అభయ హస్త ఆంజనేయస్వామి ఆలయాన్ని ధ్వంసం చేశారని విచారణలో తెలిందన్నారు. ఇందులో ఎలాంటి మత పరమైన, రాజకీయ పరమైన చర్యలు లేవన్నారు. ఆలయానికి వస్తున్న ఆదాయంపై పూజారి హరినాథ్ అనే వ్యక్తి కన్ను వేశారని ఇందులో భాగంగానే విద్యాసాగర్ ఆధీనంలో ఉన్న అభయ హస్త ఆంజనేయ స్వామి ఆలయాన్ని ధ్వంసం చేస్తే ఆ స్థానంలో నూతన ఆలయం నిర్మించి ఆలయానికి వస్తున్న ఆదాయాన్ని పొందాలన్నా దురుద్దేశంతోనే కనుగొండ స్వామి ఆలయ పూజారి హరినాథ్ మరో 5 మందితో కలిసి ధ్వంసం చేశారని పేర్కొన్నారు. నిందితుల నుండి రెండు జలెటిన్ స్టిక్స్, కారు, ఇనుప పనిముట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో మదనపల్లి డిఎస్పి కొండయ్య, ములకలచెరువు సిఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మారని పిహెచ్సిల పనితీరు..!

**ప్రభుత్వం మారినా.. మండలంలోని పిహెచ్సిల్లో వైద్యుల పనితీరు మాత్రం మారడం లేదు. ప్రజాధనంతో వేలకు వేలు జీతాలు తీసుకుంటూ.. విధులకు హాజరుకాకుండా.. ప్రయివేటు క్లినిక్లు పెట్టుకొని ఆదాయాలు గడిస్తుండడంపై స్థానికులు భగ్గుమంటున్నారు. విధులకు తూతూమంత్రంగా హాజరవుతుండడంపై సర్వత్రావిమర్శలు చోటు చేసుకుంటున్నాయి.**

- **డ్యూటీకి డాక్టర్ డుమ్మా..?**
- **ప్రయివేటు క్లినిక్లో ఆదాయాలు గడిస్తున్న వైనం**
- **104, పిహెచ్సిలకు ఎగనామం..!**
- **తూతూమంత్రంగా విధుల నిర్వహణ**
- **నిద్రమత్తులో వైద్య ఆరోగ్య శాఖ**

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని నగరిమడుగు, చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల పనితీరుపై గ్రామస్తులు మండిపడుతున్నారు. నగిరిమడుగు పిహెచ్సిలో ఓ డాక్టర్ పిహెచ్సికి రారని, ఎన్నిసార్లు చెప్పినా ఎవ్వరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే పిహెచ్సిపై ఎన్నోసార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా జిల్లా అధికారులు కూడా పట్టిం చుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకొంటున్నాయి. కనీసం 104కు కూడా సక్రమంగా హాజరుకాకపోవడంతో 104 సిబ్బందే రోగులకు వైద్య సేవలు అందించాల్సిన దుస్థితి ఏర్పడింది. పిహెచ్సిల్లో పనిచేస్తున్న ఓ డాక్టర్కు ప్రయివేటు క్లినిక్ ఉండడంతో.. ప్రజాధనంతో వేలకు వేలు జీతం తీసుకుంటూ..ప్రభుత్వ పిహెచ్సిల్లో ప్రజలకు వైద్య సేవలను అందించాల్సిన డాక్టర్ పిహెచ్సికి రాకుండా ప్రయివేటు క్లినిక్లో ఆదాయాలు గడిస్తుండడంపై స్థానిక ప్రజలు భగ్గుమంటున్నారు. పిహెచ్సికి వచ్చే రోగులకు సిబ్బందే వైద్యం చేయాల్సిన దుస్థితి నెలకొంది. నగిరిమడుగు పిహెచ్సిల్లో వైద్యులు లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికి జిల్లా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా వైద్యుల తరపున వత్తాసు పలుకుతూ తూతూమంత్రంగా తనిఖీ చేయడం, తనిఖీలకు వచ్చే సమయంలో ముందుగా చెప్పి వస్తుండడంతో వైద్యులు నిర్లక్ష్యంగా ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం, జిల్లా యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.



నగిరిమడుగు పిహెచ్సిలో వైద్యులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

**ప్రయివేటు క్లినిక్లో ఆదాయాలు :** పిహెచ్సిలో పనిచేస్తున్న ఓ డాక్టర్ తనకున్న ప్రయివేటు క్లినిక్లో ఉంటూ ఆదాయాలు గడిస్తుండడంతో పిహెచ్సికి రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మరి పిహెచ్సిలు, ప్రభుత్వాసుపత్రిల్లో పని చేసే వైద్యులు ప్రైవేటు క్లినిక్లు పెట్టుకొని ఆదాయాలు గడిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న వైద్యుల పనితీరుపై జిల్లా యంత్రాంగం స్పందిస్తుందో లేదో వేచి చూడాలి.



చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

**104కు ఎగనామం..! :** పిహెచ్సిల పరిధిలో నిర్వహించే 104 సేవలకు కూడా డాక్టర్ హాజరుకాకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఏదో ఒక రోజు వచ్చి 104లో ఫొటోలకు ఫోజులు ఇచ్చి మళ్లీ వెళ్లిపోతుండడంతో 104 సిబ్బంది, గ్రామంలో వైద్య సిబ్బంది వైద్య సేవలను అందించాల్సిన దుస్థితి ఏర్పడింది.

**నిద్రమత్తులో వైద్య ఆరోగ్యశాఖ :** పిహెచ్సిలను తనిఖీ చేయాల్సిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిద్రమత్తులో జోగుతుండడంపై పలు విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లా అధికారులు తనిఖీ చేయకుండా.. తనిఖీల సమయంలో ముందస్తు సమాచారం ఇచ్చి వస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. మరి దీనిపై జిల్లా యంత్రాంగం ఏం చేస్తుందో వేచి చూడాలి.

#### ఆస్పత్రిలో డాక్టర్ ఉండరు



ఆస్పత్రిలో అసలు డాక్టరే ఉండరు. అసలు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో.. అసలు వస్తారో రారో కూడా ఎవ్వరికీ తెలియదు. ఆస్పత్రికి ఎప్పుడు పోయినా డాక్టర్ మాత్రం ఉండరు. ఎవరో ఉంటారు వాళ్లు మాత్రలు ఇచ్చి, సూదేసి పంపిస్తారు. డాక్టర్ అందుబాటులో ఉండేలా చూడాలి.

**- రెడ్డెప్ప, నగిరిమడుగు, వాల్మీకిపురం మండలం.**



కొండయ్యగారిపల్లె సచివాలయాన్ని సందర్శించిన డిఎల్‌డిఒ అమర్నాథ్‌రెడ్డి

## సమయపాలన తప్పక పాటించాలి : డిఎల్‌డిఒ

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

మండలంలోని కొండయ్యగారిపల్లె గ్రామ సచివాలయాన్ని మదనపల్లె డిఎల్‌డిఒ అమర్నాథ్ రెడ్డి, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఎఒ రమేష్ బాబులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సమయానికి హాజరు వేయాలన్నారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్, పలు రికార్డులను, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. గ్రామ సచివాలయాల్లో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పనిచేస్తున్నారని, ప్రతి ఉద్యోగి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించాలని ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రతినెల 1వ తేదీన ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలని తెలిపారు. ఏ క్షణమైనా ఉన్నతాధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ గ్రామ సచివాలయాలను సందర్శించే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు విధిగా తమ విధులను నిర్వర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎఒ రమేష్‌బాబు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి-కలికిరి**

మండలంలో పారిశుధ్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ భానుమూర్తిరావు సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్యం అస్థవ్యస్తంగా మారిందన్నారు. ప్రతి గ్రామంలోనూ మురికినీటి కాలువలు, ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పండకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేప ట్టాల ని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఇఒలు పాల్గొన్నారు.

## నట్టల నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి-చిన్నమండెం**

పశు కాపరులు తమ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తప్పక తాపించాలని పశు వైద్యాధికారి డాక్టర్ గణేష్ తెలిపారు. మండలంలో దాదాపు 44320 గొర్రెలు, 5867 మేకలు ఉన్నాయని, వీటికి నట్టల నివారణ లో భాగంగా మండలానికి 50 వేల డోసుల మందులను ప్రభుత్వం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న పశు సంవర్ధక సహాయకులు ఈనెల 31వ తేదీ వరకు అన్ని సన్న జీవాలకు తాపిస్తారని తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. **ప్రజాశక్తి-కలికిరి :** నట్టల నివారణ టీకాలను గొర్రెలు మేకలు పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట మునినాయుడు తెలిపారు. స్థానిక మండలంలోని మర్రికుంటపల్లి హరిజనవాడ గ్రామంలో గొర్రెలు మరియు మేకల నట్టల నివారణ కార్యక్రమాన్ని సర్పంచ్ రెడ్డిరాము ప్రారంభించి, అందరూ రైతులు ఈ ప్రభుత్వ కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలి పారు. కార్యక్రమంలో ఇలియాజ్ జెవిఒ, అనిల్, పవన్ మొదలగు పశుసంవర్ధక శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## వేగం కన్నా ప్రాణం మిన్న : ఎస్ఐ

**ప్రజాశక్తి-పుల్లంపేట**

వేగం కన్నా ప్రాణం మిన్న అనే నినాదంతో వాహనదారులు రోడ్డుపై ప్రయాణించాలని ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రమైన పుల్లంపేటలో రోడ్డు భద్రతా నియమాలు పాటించే విధానంపై అవగాహన కల్పించారు. కడప-చెన్నై జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తూ మీరు నడుపుతున్న వాహనములకు సంబంధించిన రికార్డులు పరిపూర్ణంగా ఉండాలని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా లేకుండా జరగరాని ప్రమాదం జరిగితే దాని వలన వచ్చే నష్టాలు గురించి తెలిపారు వాహనాలకు రికార్డులు సక్రమంగా లేకుంటే అపరాధ రుసుంతో పాటు కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

**ప్రజాశక్తి - నందలూరు**

మండలంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో అధిక వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలను రాజంపేట ఉద్యాన అధికారి సురేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి జి.మల్లికార్జున గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అధిక వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ అధిక వర్షాలకు వరి పొలాలలో నిలబడిన నీటిని ప్రత్యేక కాలువల ద్వారా వెంటనే బయటికి పంపాలని తెలిపారు. నేలకు ఒరిగిన వరి పైరును కట్టలుగా కట్టి, నిలబెట్టుకోవాలన్నారు. కోత కోసి నిల్వ ఉంచిన వరి కుప్పలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు మాట్లాడుతూ ఉద్యాన పంటలైన అరటి, నిమ్మ, పసుపు, బొప్పాయి పంటలలో తేమ ఆరిన తరువాత 13.0.45 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నందలూరు విఎఎం షణ్ముఖ్, వికీ వరున్, రైతులు పాలోన్నారు.



బురదమయమైన ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

## వారపు సంతలో పారిశుధ్య పనులు


### ప్రజాశక్తి వార్తకు స్పందన

**ప్రజాశక్తి-కలకడ** : వారపు సంతలో పారిశుధ్య పనులు ముమ్మరం చేసినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండల కేంద్రంలో వారపు సంతలో బురదమయంగా ఉండటంతో గురువారం ప్రజాశక్తి దినపత్రికలో 'చినుకు పడితే చిత్తడే' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ఎంపిడిఒ అబ్దుల్ రహీం, ఇఒఆర్‌డిఒ వెంకటసుబ్బయ్య, పంచాయతీ సిబ్బంది చేత బ్లీచింగ్ చేయించి బురద మయంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. సంతలో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



# ముద్దిరెడ్డిగారిపల్లె రోడ్డుకు మోక్షమెన్నడో?

- బురదమయమైన రోడ్డుతో అవస్థలు పడుతున్న ప్రజలు
- ఎస్‌సి,ఎస్‌టి కాలనీలపై కనికరం చూపని అధికారులు
- ఎమ్మెల్యే స్పందించాలని వేడుకోలు




ఇళ్ల ముందు బురదతో నిండిన రోడ్డు   బుచ్చిరెడ్డిగారిపల్లె నుంచి ముద్దిరెడ్డిగారిపల్లెకు వెళుతున్న రోడ్డు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

గ్రామాల అభివృద్ధి తమ లక్ష్యం అంటూ ఒకపక్క కూటమి ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అంటుంటే మరోపక్క గ్రామాలలో అటు అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు కానీ భిన్నంగా వ్యవహరిస్తున్నారని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఒకపక్క పల్లె పండగను ప్రభుత్వం సిద్ధమవుతుంటే, మరోపక్క తమ గ్రామాల గోడును పట్టించుకోవాలని పల్లె ప్రజలు కోరుతున్నారు. మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ ముద్దిరెడ్డిగారిపల్లెలో ఎస్‌సి వర్గానికి చెందిన ప్రజలు అధికంగా నివసిస్తున్నారు. ఇక్కడ నుంచి వారు పండించిన పంటలను అమ్ముకోవడానికి, వారి జీవనాధార అవసరాల నిమిత్తం రాకపోకలు కొనసాగించడానికి మండల కేంద్రమైన నిమ్మనపల్లెకు, నియోజకవర్గమైన మదనపల్లెకు వెళ్లాల్సి వస్తుంది. తమ రాకపోకలు కొనసాగించడానికి తమ వ్యవసాయ దిగుబడులను మార్కెట్‌కు తరలించుకోవడానికి ముద్దిరెడ్డిగారిపల్లెకు సరైన రోడ్డు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న రోడ్డు మార్గం కాస్త గుంతలు, కంకర తేలి ప్రజలు రాకపోకలు కొనసాగించడానికి ఇబ్బందిగా మారిందన్నారు. వర్షం పడిందంటే నీరు నిలుస్తూ, గుంతలతో రోడ్డు మొత్తం బురదమయంగా మారి కనీసం నడిచి వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ముద్దిరెడ్డిగారి పల్లెకు సిమెంటు రోడ్డు కానీ, తారు రోడ్డు కానీ వేయాలని గత కొన్నేళ్లుగా అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలను ఇస్తున్నా, వారు మాత్రం ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప, తమ సమస్యను ఏమాత్రం పట్టించుకోవడంలేదని అంటున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రత్యేకంగా ఎస్‌సి, ఎస్‌టి నివాస ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, మురుగునీటి కాలువలు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. ఇక్కడి అధికారులు మాత్రం ఎస్‌సి,ఎస్‌టి నివాస ప్రాంతాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి గ్రామాల్లోని ఇళ్ల ముందర సైతం రోడ్డు మొత్తం బురదమయంగా మారి నడిచిపోయే అవకాశం లేని స్థితి ఏర్పడిందని తెలిపారు. కనీసం ఇప్పటికైనా అభివృద్ధి ఆకాంక్షించే ప్రభుత్వంలో భాగమైన మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రత్యేక చొరవ తీసుకొని తక్షణం బుచ్చిరెడ్డిగారిపల్లె నుంచి ముద్దిరెడ్డిగారిపల్లె వరకు సిసి రోడ్డు కానీ, తారు రోడ్డు కానీ ఏర్పాటు చేసి పల్లె ప్రజల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు, రైతులు వేడుకుంటున్నారు. మరి ముద్దిరెడ్డిగారిపల్లె ప్రజా సమస్యలపై మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



మదనపల్లి : వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

మండల పరిధిలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకి సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని తవళం, నిమ్మనపల్లి, దిగువపల్లిలో మహాకవి వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని వాల్మీకులు, కూటమి నాయకులు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా జరుపుకున్నారు. దిగువపల్లిలో వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జయంతిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర పండుగగా ప్రకటించి వాల్మీకులకు ప్రత్యేక స్థానాన్ని కల్పించారని అన్నారు. వాల్మీకులకు ఎస్‌టి జాబితాలో చేర్చడంపై ప్రభుత్వం కేంద్రాన్ని సంప్రదించినట్లు తెలిపారు. ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ పద్మావతి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సాధికార సమితి కన్వీనర్ కె.లక్ష్మన్న, టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జె. వెంకటేష్, టిడిపి మండల అధ్యక్షులు వెంకటరమణ, సుధాకర్‌రావు, మేష రామకృష్ణ, చెంద్రా యుడు, చినబాబు, మల్లికార్జున, చంద్రశేఖర్, బొమ్మనపల్లి లక్ష్మన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు. **రామసముద్రం :** మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి కులస్తుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలుఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో 5 జిల్లాల్లో వాల్మీకులు ఎస్‌టిలుగా, 8 జిల్లాల్లో బిసిలుగా పరిగణింపబడుతున్నారని అన్నారు. గతంలో వైసిపి నాయకులు ఓటు బ్యాంకు కోసం వాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్, మండల విఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు దొడ్డిపల్లి ఆనంద్, వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులకుంట్ల హరిబాబు, తలారి శ్రీనివా సులు, కృష్ణమూర్తి, వెంకటరమణ, దుర్గాప్రసాద్, మేస్త్రి నరసింహులు, చంద్రప్ప, కేశవ, బసప్ప, రామ్మూర్తి, మాజీ మండల అధ్యక్షులు కృష్ణంరాజు, చిన్నా స్వామి పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ వేటే జీవనాధారంగా బతికి, వేటను పక్కకు పెట్టి అహింసా వాదంలోకి వెళ్లి రామాయణం లాంటి మహా గ్రంధాన్ని అందించిన ప్రాతః స్మరణీయులు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరు మలరావు, ఎంఐఎస్ శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పట్టణ కేంద్రంలోని బైపాస్ రోడ్డులో వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద వాల్మీకి జయంతి వేడుకలు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నల్లబోతుల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో వాల్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మర్రి రవి, గోవిందు బాలకృష్ణ, రాంనగర్ కృష్ణరావుయాదవ్, శ్రీనివాసు యాదవ్, వాల్మీకి సంఘం నాయకులు శ్రీహరి, నాగరాజ,గణేష్, నరసింహ, మణి, వినోద్, రమేష్, కాశీ పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** వాల్మీకిపురం పట్టణంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాల్మీకి చిత్రపటాన్ని అలంకరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత టమేటా మార్కెట్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా శ్రీ పట్టాభి రామాలయం వరకు చేరుకుని, ఆలయంలోని వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీ కులను ఎస్‌టి జాబితాలో చేర్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనం తరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం సభ్యులు టైలర్ రామక్రిష్ణ, రాజేష్, రెడ్డప్ప, రెడ్డి రామ్, ఫణి కుమార్, శ్రీనాథ్, గోవిందరాజులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక తంబళ్లపల్లిలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ త్యాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐటిఐ స్టాఫ్, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పిలు పాల్గొన్నారు. **మదనపల్లి :** శ్రీ ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణం నీరుగట్టువారిపల్లి మార్కెట్‌యార్డులో వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సద్దల జయసింహా, వలసల మంజునాథ్, నరసింహులు పెద్ద ఎత్తున పుర ప్రజలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మదనపల్లె చిత్తూరు బస్టాండు సర్కిల్, రాగిమాను సర్కిల్‌లో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాల్మీకి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మస మాజ్ రాష్ట్ర అధ్యక్షులు మేకల విజయ్ మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులకుంట్ల హరిబాబు, యువజన విభాగం అధ్యక్షులు టేకుపల్లె శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ లక్ష్మీదేవి, చీకిలబైలు సర్పంచి ప్రభాకర్, ముత్తరాశి హరికృష్ణ, చెంద్రయుడు, రామసముద్రం కిట్టన్న, పవన్, టిడిపి మండలాధ్యక్షులు విజయ్ కుమార్‌గౌడ్, కూటమి నేతలు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ కార్యాలయంలో ఆదికవి శ్రీవాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కమీషనర్ పల్లవి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు **లక్కిరెడ్డిపల్లి :** మండల కేంద్రంలో బిసి వేదిక ఆధ్వర్యంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. పభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ విజయ భాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మద్దుల రామచంద్రయ్య, కృష్ణయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు, సుబ్రహ్మణ్యం ఆదికేశవులు, పి.వి. రమణయ్య, గురుస్వామి బసయ్య, రెడ్డెన్నపాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే మా నినాదం :'చమర్తి'

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

గ్రామాల అభివృద్దే నినాదంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అత్తిరాలగ్రామంలో రూ.1.52కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పేరు పొందిన హత్యరాల త్రేతేశ్వర స్వామి సన్నిధిలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామని అభివృద్ధి, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏను గొండ పాలెం, దిగువ తాండ, కదిరాయ చెరువు పంచాయతీలలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ మూడు పంచాయ తీలలో సుమారు రూ .2.5 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీప్రసన్న, కమలనాథ్, ఎంపి టిసిలు, మాజీ ఎంపిటిసిలు, ఉపాధి హామీఎపిఒ చెన్నకేశవులు, పిఆర్‌ఎఇ రూప్‌సాగర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధి లోని మల్లూరు గ్రామ పంచాయతీకి రూ.16 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి ఆ గ్రామ సర్పంచ్ దేవపట్ల నజీర్ , ఇఒపిఆర్‌డి శేఖర్ నాయక్, భూమి పూజ చేశారు. ఈ సిసి రోడ్లు గ్రామ పరిధిలోని ఎగువ హరిజనవాడ, గంగి రెడ్డిగారిపల్లి, బెల్లం వాండ్లపల్లిలకు మంజూరయ్యాయని ఆ గ్రామ సర్పంచ్ నజీర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ దేవపట్ల నజీర్‌బాషా, ఉప సర్పంచ్ ఆదెమ్మ, ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్, పంచాయితీ సెక్రెటరీ గౌస్ పీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజ్ కుమార్,వెల్ఫేర్ అసిస్టెంట్ రామ్మోహన్,సుమలత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా టిడిపి యువ నాయకుడు మదన్మోహన్ ఆధ్వర్యంలో చౌటుపల్లి గ్రామపంచాయతీలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాలలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటుచేసి మంత్రి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని అన్నారు. కూటమి పాలనలో గ్రామాలకు మహర్దశ పట్టివందని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర గురు స్వామి, ప్రతాప్ రెడ్డి, ఆది మూలం వేమయ్య, కావాలి ఆంజనేయులు, వెంకట కృష్ణ, చెల్లు శ్రీనివాస్ యాదవ్, శివశంకర్, ఆదిమూలం రెడ్డి శేఖర్, దండే రామచంద్ర పాల్గొన్నారు.

## పల్లెటూరి ఆణిముత్యం తేజస్వినికి సిఎం ప్రశంసలు

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి :** జులై నెలలో విడుదలైన సిఎ పరీక్ష ఫలితాలలో 14వ ర్యాంకు, ఆగస్టు నెలలో విడుదలైన సిఎంఎ పరీక్షా ఫలితాలలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించి ఆంధ్ర రాష్ట్రానికి వన్నెతెచ్చిన కన్య మడుగు తేజస్విని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు అందుకుంది. గుంటూరు మాస్టర్ మైండ్స్ యాజమాన్యం ఆహ్వానంతో తంబళ్లపల్లి మండలం కన్యమడుగుకు చెందిన సామాన్య రైతు కె.రఘురాం రెడ్డి, నాగవేణిల కుమార్తె తేజస్విని విజయవాడ సచివాలయం నుంచి ఆహ్వానం అందింది. తేజస్విని తండ్రి రఘురాంరెడ్డి, బాబాయ్ అమర్నాథ్‌రెడ్డిలతో సిఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించారు. ముఖ్యమంత్రి ఆ బాలికను అభినందిస్తూ ప్రశంసించారు. వారి కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పల్లెటూర్లో పుట్టి రాష్ట్రానికె వన్నె తేవడం గర్వ కారణమని భవిష్యత్తులో మరిత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.

## కోర్టు నూతన భవనాలకు డిపిఆర్ సిద్ధం చేయండి

**ప్రజాశక్తి-నందలూరు**

నందలూరు జూనియర్ సివిల్ కోర్టు నూతన భవనం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును సత్వరమే తయారుచేసి ఉన్నతాధికారులకు పంపవలసిందిగా రాజంపేట ఆర్‌అండ్‌బి ఇఇ సహదేవరెడ్డిని గురువారం వినతి పత్రం ద్వారా కోరినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎపి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తమ కోరికపై ఇఇ సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది తెట్టు నూర్ ముహమ్మద్ పాల్గొన్నారు.

## కంప చెట్లు తొలగింపు

**ప్రజాశక్తి-వీరబల్లి :** మండలంలోని మట్లి గ్రామ పంచాయతీ పరిధిలోని యల్లంపల్లి నుంచి బోడి మల్ రెడ్డి గారిపల్లి రహదారికి ఇరువైపులా కంప చెట్లను గురువారం గ్రామ సర్పంచ్ సోమారపు నాగార్జునచారి తన సొంత నిధులతో జెసిబితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లంపల్లి నుంచి బోడిమల్‌రెడ్డిగారిపల్లె వరకు పోయే రహదారికి రెండు వైపులా కంప చెట్లు, ముళ్ళ పొదలు బారి వృక్షాలు కావడంతో ఆ రహదారి వెంబడి పోయే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి తేవడం జరిగిందన్నారు. మలుపులు దగ్గర ఎదురెదురుగా వచ్చే వాహ నదారులు ఒకరికొకరు కనపడక ప్రమాదాల జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందలూరు రవీంద్రారెడ్డి, కనితి వెంకట్ రమణ, పుల్లగూర శ్రీనివాసులు, పుల్లగూర ధర్మయ్య, పుల్లగూర కేశవులు, కరచక్క వెంకట్ రమణ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి ఆవులు మృతి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

విద్యుదాఘాతంతో రూ.2లక్షల విలువైన తెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డ సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుని కథనం మేరకు.. మదనపల్లి పట్టణం, బసినికొండ లోని పుంగనూరు రోడ్డు, ఆంజనేయస్వామి గుడి సమీపంలో నివాసముంటున్న రమణయ్య పాడి ఆవులను మేపుకుంటూ పాల విక్రయం ద్వారా జీవనం సాగిస్తున్నాడన్నారు. జెసిబిలు మరమ్మతులు చేసే షాపు వద్ద ఆవు లను కట్టేశాడు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా కావడంతో ఆవులు విద్యుదాఘాతానికి గుర్రై అక్కడి కక్కడే మృతి చెందాయన్నారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



గువ్వల చెరువు ఘాట్‌రోడ్డులో ఆకర్షణీయంగా ఉన్న జలపాతం

## చూపరులను ఆకట్టుకుంటున్న జలపాతం

**ప్రజాశక్తి-రామాపురం**

మండలంలోని గువ్వలచెరువు ఘాట్ సమీపంలో జలపాతం [illegible] రోజులుగా పాలకొండల్లో కురుస్తున్న వర్షాలకు గువ్వలచెరువు ఘాట్ రోడ్ సమీపంలో ఉన్న కొండల మధ్యలో వస్తున్న జలపాతం రాయచోటి వైపు నుంచి కడప వైపుకు వెళుతున్న ప్రయాణికులను ఆకర్షిస్తోంది. జలపాతం చూడడానికి మండలంలోని యువత, మహిళలు, పిల్లలు ఎగబడుతున్నారు. గురువారం వర్షం తగ్గుముఖం పడడంతో జలపాతాన్ని చూసేందుకు జనం తరలివెళ్లారు.

## మానవ అక్రమ రవాణా అరికట్టాలి

**ప్రజాశక్తి-వీరబల్లి :** మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా అతి పెద్ద సవాలుగా మారిందని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ది మూమెంట్ ఇండియా, గ్రామ జ్యోతి సొసైటీ, విఆర్‌డిఎస్ సంస్థ సంయుక్తంగా మానవ అక్రమ రవాణా నిర్మూలన పోస్టర్లను వారు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, నిరక్షరాస్యత కూడా అక్రమ రవాణాకు కారణమని అభిప్రాయం వ్యక్తం చేశారు. అక్రమ రవాణా నిరోధించేందుకు విద్యా దశలోనే అవగాహనా పెంచుకోవాలని పేర్కొన్నారు. నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలపై అందరూ అవగాహన పెంచు కోవాలని పేర్కొన్నారు. ప్రేమ, పెళ్లి, ఉద్యోగం, ఉపాధి, సినిమా అవకాశాల పేరుతో అక్రమ రవాణా అధికంగా ఉందని, అరికట్టే దిశగా చర్యలు చేపట్టడంతోపాటు అవగాహన కల్పించాలన్నారు. మహిళలను బలవంతపు వ్యభిచారంలోకి దించే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో చలపతి, పోలీసు సిబ్బంది చంద్ర, సుబ్ర హ్మణ్యం, సహాదేవ్ పాల్గొన్నారు.

## అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-కంభంవారిపల్లి :** వరుస మూడు రోజులపాటు కురిసిన వర్షానికి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని అంటువ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లెలమంద వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండంలోని దేవాండ్లపల్లిలోని ప్రజలకు మలేరియా, డెంగీ, డయే రియాపై అవగాహన కల్పించారు. జిల్లెలమంద, నూతన కాల్వ, మారెళ్లలో తదితర గ్రామాలను సందర్శించి ప్రజలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అప్రమత్తంగా జాగ్రత్త చర్యలు పాటిస్తే సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. నీటిని కాచి వడపోసి లేదా క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని సూచించారు. తాజా ఆహారం తినాలి, తినేముంద, మల విసర్జన తరువాత చేతులు సబ్బు తో శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. బహిరంగ మల విసర్జన చేయకూడదని అన్నారు. వండిన ఆహా పదా ర్థాలు సురక్షిత ప్రదేశంలో ఈగలు వాలని చోట నిల్వ చేయాలని, పరిశుభ్రతను పాటించాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట దోమలు విజృంభించి డెంగీ, మలే రియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలని, కొబ్బరి చిప్పలు ,పాత టైర్లుని కాల్చి వేయాలని అన్నారు. ఇంటిలోని నీటి తోట్టెలని వారానికి ఒకసారి బాగా కడిగి ఫ్రైడే డ్రైడేగా పాటిం చాలని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుం డా ఉండచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా గంగమ్మ జాతర

**ప్రజాశక్తి-పుల్లంపేట :** మండల పరిధిలోని ఆర్ వడ్డేపల్లి గ్రామంలో గురువారం గంగమ్మ జాతరను గ్రామస్తులు మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే లేచి పొంగుబాళ్లు పెట్టుకొని గంగమ్మకు చల్ల పోసుకొని గంగమ్మకు అర్పించామని గ్రామస్తులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి బంధువులు, స్నేహితులు వచ్చి పొంగళ్ళు పెట్టుకొని ఉల్లాసంగా జాతరలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## నిమ్మనపల్లె యువకుడు బెంగళూరులో హత్య

### స్నేహితుడి చేతిలో హతం..
### గుండ్లబురుజు దళితవాడలో విషాదం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

నిమ్మనపల్లె మండలానికి చెందిన యువకుడు బెంగళూరులో హత్య చేయబడ్డాడు. మిత్రుడి భార్యతో అక్రమ సంబంధం పెట్టుకొని చివరకు స్నేహితుని చేతిలోనే హతమయ్యాడు. యువకుని మరణవార్తతో నిమ్మనపల్లె గుండ్లబురుజు దళితవాడలో విషాదం అలుముకుంది. హత్య ఉదంతానికి సంబంధించి బెంగుళూరు ఎస్ఐ సెల్వం తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం, గుండ్లబురుజు దళితవాడకు చెందిన రమణ కొడుకు బాలాజీ (24) కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు పట్టణం, పవణహళ్లి పియస్ పరిధిలోని దొడ్డనహళ్లిలో ఓ ఫ్యాక్టరీలో పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడని తెలిపారు. అదే ఫాక్టరీలో పని చేస్తున్న రామసముద్రం మండలానికి చెందిన స్నేహితుడు రెడ్డెప్పరెడ్డి భార్య తో బాలాజీ అక్రమ సంబంధం పెట్టుకున్నాడని తెలిపారు. ఈ వ్యవహారాన్ని పసికట్టిన రెడ్డెప్పరెడ్డి తనకే నమ్మకద్రోహం చేస్తావా అని ముందస్తు వ్యూహంతో బాలాజీని దారుణంగా హత్య చేశాడని చెప్పారు. హత్యకు గురైన ఉదంతం గురువారం ఉదయం వెలుగులోకి రావడంతో పవణహళ్లి పోలీసు స్టేషన్ ఎస్ఐ సెల్వం వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు బెంగళూరుకు చేరుకుని హత్యకు గురైన కుమారుడు బాలాజీ మృతదేహాన్ని నిమ్మనపల్లె లోని స్వగ్రామంకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

## భార్య ఊరెళ్లిందని భర్త ఆత్మహత్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

భార్య అలిగి పుట్టింటికి వెళ్లడంతో మనస్థాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో పట్టణ సీఐ చాంద్‌బాషా కథనం మేరకు.. స్థానిక నీరుగట్టువారి పల్లెలోని రామిరెడ్డి లేఅవుట్‌లో కాపురం ఉంటున్న షేక్ రెహమాన్ కుమారుడు రిజ్వాన్(35), టాటా ఏస్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య పిల్లలను పోషించు కుంటున్నాడని చెప్పారు. ఈ క్రమంలో రిజ్వాన్ భార్య వారం రోజుల క్రితం కుటుంబ సమస్యలపై భర్త తో గొడవపడి అలిగి పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. పలుమార్లు కాపురానికి రావాలని పిలిచినా రాకపోవడంతో తీవ్ర మానస్థాపం చెంది జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లోనే మోల్డింగ్ కమ్మికి భార్య చీరతో ఉరి వేసుకుని బలవన్మరణం చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## నిరుద్యోగ యువతి ఆత్మహత్యాయత్నం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

నిరుద్యోగ యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని సిద్దారెడ్డిగారి పల్లికి చెందిన శివశంకర్, భాగ్యమ్మ దంపతుల కుమార్తె శిరీష డిగ్రీ వరకు చదివి ఉద్యోగం కోసం చూస్తోందని తెలిపారు. మూడు నెలల క్రితం బెంగుళూరులోని స్నేహితుల వద్దకు వెళ్లిందని చెప్పారు. అక్కడ ఏమి జరిగిందో ఏమో గురువారం తెల్లవారుజామున బెంగు ళూరు నుంచి స్వగ్రామానికి చేరు కుందని అన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ పొలానికి వెళ్లగానే ఇంటిలోఉన్న విషపూరిత మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందన్నారు. వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సిఎంసికి రెఫర్ చేసినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.